ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

గురువారం 11 డిసెంబరు 2025

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ఉండాలి

కీసర రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ఉండాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. బుధవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ తిమ్మాయిపల్లిలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. గత నెలలో దివ్యాంగులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సందర్శనకు విద్యార్థులు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భారీగా తరలి వచ్చారు. ఇక్కడ ఏర్పాట్లు చూసి వారు ఆశ్చర్యపడ్డారు. నిన్న మొన్నటి వరకు రాళ్ల రప్పలతో ఉన్న ప్రాంతం ఒక్కసారిగా అంతర్జాతీయ వేదికగా రూపుదిద్దుకోవడం చూసి ఆశ్చర్యపోయారు. అలాగే ఇక్కడ ఏర్పాట్లు చూసి అబ్బురపడ్డారు.



సమ్మిట్ ప్రాంగణంలో సందర్శకులు

సెమినార్‌కు హాజరైన దగ్గుబాటి రాణా



అబ్బురం.. ఆశ్చర్యం

సమ్మిట్‌లో సందర్శకుల సందడి

- సాధారణ ప్రజలకు అనుమతి
- 4,500మంది హాజరు
- అధిక సంఖ్యలో విద్యార్థుల రాక
- సందర్శకులను ఆకట్టుకున్న రోబోలు
- సమ్మిట్ ప్రాంతానికి వచ్చేందుకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం
- తాగునీరు, భోజన వసతులు
- ప్రత్యేక ఆకర్షణగా బోనాల ప్రదర్శన
- సినీహీరో దగ్గుబాటి రాణా రాకతో కేరింతలు
- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన రాచకొండ సీపీ



రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం/కందుకూరు/మహేశ్వరం, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట-బేగరికంచలో ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి పలు రంగాల్లో నిష్ణాతులను ఆహ్వానించింది. 6 ఖండాలు, 44 దేశాలు, దేశంలోని పలుప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రతినిధులతో ఈ ప్రాంగణం రెండు రోజుల పాటు సందడి నెలకొంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో, సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటుచేసిన సమ్మిట్ ప్రాంగణాన్ని సాధారణ ప్రజలు సందర్శించేందుకు ప్రభుత్వం

మిగతా 6వ పేజీలో...


సెమినార్ హాల్‌లో విద్యార్థుల నృత్యం


ఫ్యూచర్ సిటీ నమూనాను తిలకిస్తున్న విద్యార్థులు

చలి పంజా

రికార్డు స్థాయిలో పడిపోయిన ఉష్ణోగ్రతలు

కురుస్తున్న పొగమంచు • సాయంత్రం నుంచే చలిగాలులు

• బయటకు రావాలంటేనే జంకుతున్న జనం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చలి పంజా విసురుతోంది. పలు ప్రాంతాల్లో కనీవినీ ఎరుగని రీతిలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 6.6 డిగ్రీల

మిగతా 7వ పేజీలో...

ఆయా జిల్లాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు

జిల్లా	ప్రాంతం	కనిష్ఠ(డిగ్రీలు)
రంగారెడ్డి	రెడ్డిపల్లి	6.6
వికారాబాద్	మోమిన్‌పేట	6.9
మేడ్చల్	ఉప్పల్	9.4



కీసర నుంచే స్టార్ట్

GHMC

300 డివిజన్లుగా జీహెచ్ఎంసీ పరిధి

హద్దులు ప్రకటిస్తూ గెజిట్ విడుదల

మేడ్చల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్‌లో 300 డివిజన్లకు హద్దులను ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. నగర శివారు మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని 27 మున్సిపాల్టీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయడంతో డివిజన్ల సంఖ్య పెరిగింది. కాగా జీహెచ్ఎంసీలో విలీనమైన జిల్లాలోని మున్సిపాల్టీలను ప్రభుత్వం డివిజన్‌లుగా ఏర్పాటు చేసింది. జీహెచ్ఎంసీని 300 డివిజన్‌లకు పెంచగా జిల్లా నుంచే మొదటి డివిజన్ ప్రారంభమౌతూ, చివరి డివిజన్ కూడా జిల్లాలోనే ఉండటం విశేషం. 300 డివిజన్‌లలో నంబర్ వన్ డివిజన్ కీసర నుంచి ప్రారంభమై తూంకుంట వద్ద ముగియనుంది. నగరానికి ఈశాన్యంలో ఉన్న కీసర నుంచి డివిజన్‌లు ప్రారంభమౌతూ ఘట్‌కేసర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మీదుగా నగరం నుంచి తిరిగి మేడ్చల్ జిల్లాలోని 300వ డివిజన్ తూంకుంట వద్ద జీహెచ్ఎంసీ పరిధి ముగియనుంది.

అభ్యంతరాలకు అవకాశం

డివిజన్ల పేర్లు, వాటి హద్దులను తెలుపుతూ గెజిట్‌ను జీహెచ్ఎంసీ సర్కిళ్లు, జోనల్ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ఏర్పాటు చేశారు. అధికారిక వెబ్‌సైట్‌లో కూడా ఉంచడంతోపాటు వారంలోపు హద్దులు, కొత్త డివిజన్‌లపై అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించనున్నారు. అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన తర్వాత జీహెచ్ఎంసీ పాలక మండలి ఆమోదంతో విలీన ప్రక్రియ పూర్తవుతుంది. కాగా, కొత్త డివిజన్‌ల ఏర్పాటుపై పలువురు అభ్యంతరాలు, ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమౌతున్నట్లు తెలిసింది. ఇటీవల జీహెచ్ఎంసీలో విలీనమైన మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌ల నుంచి పలువురు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమౌతున్నారు. మరోవైపు డివిజన్‌ల ఏర్పాటు ఖరారు కావడంతో ఆయా పార్టీల నేతలు రిజర్వేషన్‌లపై చర్చించుకోవడం ప్రారంభించారు.

17 మంది ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

వికారాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 17 మంది ఉద్యోగులను వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ సస్పెండ్ చేశారు. జిల్లాలో తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో ప్రిసైడింగ్, ఇతర పోలింగ్ అధికారులుగా నియామకమైన వారు తమ విధులు నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే అభియోగాలపై ఆయన వారిపై సస్పెన్షన్ వేటు వేశారు. జిల్లాలో ఇంత మందిపై సస్పెన్షన్ వేటు వేయడం ఇదే తొలిసారి. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులపై కలెక్టర్ తీసుకున్న చర్యలతో ప్రభుత్వ ఉద్యోగుల్లో కలకలం రేగింది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇటీవల నిర్వహించిన సిబ్బంది శిక్షణా కార్యక్రమాలకు, ఎన్నికల విధులకు గైర్హాజరైన వారిపై కూడా చర్యలు తీసుకునేందుకు జిల్లా ఎన్నికల అథారిటీ సన్నద్ధమవుతోంది. మండలాల వారీగా శిక్షణా కార్యక్రమాలకు, పోలింగ్ విధులకు గైర్హాజరైన వారి సమాచారం మండలాల వారీగా సంబంధిత అధికారులకు జిల్లా ఉన్నతాధికారులకు పంపించారు. నేడో, రేపో వారిపైన కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

నేడే తొలి పంచాయతీ

ఎన్నికలకు సర్వం సిద్ధం చేసిన అధికారులు

తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. గ్రామాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎన్నికల అధికారులు బుధవారం ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పంచాయతీ పోలింగ్ గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటకు ముగుస్తుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సర్పంచ్, వార్డు సభ్యుల ఓట్లను లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు. అలాగే ఉప సర్పంచ్‌ను ఎన్నుకుంటారు. ఈ నేపథ్యంలో పోలింగ్ ఉన్న గ్రామాల్లో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు.



కొడంగల్‌లో ఎన్నికల సామగ్రితో తరలుతున్న సిబ్బంది



- కేంద్రాలకు తరలిన సిబ్బంది, ఎన్నికల సామగ్రి
- పంపిణీ కేంద్రాలను పరిశీలించిన అధికారులు
- ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం
- ఒకే రోజు ఓట్ల లెక్కింపు.. ఫలితాల వెల్లడి.. ఉప సర్పంచ్ ఎన్నిక

తాండూరు/కొడంగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. గురువారం తొలి విడత తాండూరు నియోజవర్గంలో పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 149 గ్రామపంచాయతీలుండగా, 26 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో 123 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నికల కోసం భారీ బందోబస్తు

తాండూరు నియోజకవర్గంలో ఎన్నికల కోసం పోలిస్ శాఖ ఆధ్వర్యంలో 500 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అదనపు ఎస్పీ రాములు తెలిపారు. తాండూరుకు ఇద్దరు అదనపు ఎస్పీలు, నలుగురు డీఎస్పీలు, 13 మంది సీఐలు, 40 మంది ఎస్ఐలను నియమించారు. 26 గ్రామ పంచాయతీలు సమస్యాత్మకంగా గ్రామాలుగా గుర్తించారు. సమస్యాత్మక పంచాయతీల వద్ద ఒక ఎస్ఐ పర్యవేక్షణ ఉంటుంది. అక్కడ అదనపు భద్రతను కూడా ఏర్పాటు చేస్తారు.


తాండూరులో ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

కేంద్రాలకు తరలిసిన సిబ్బంది

తాండూరు మండల పరిధిలోని 33 గ్రామ పంచాయతీలకు ఆరు గ్రామాలు, 96 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 28 పంచాయతీల్లో, 239 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. 28 పంచాయతీలకు 75 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 239 వార్డుల్లో 426 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 239 పోలింగ్ బాక్సులతోపాటు 239 మంది ప్రొసీడింగ్ అధికారులు మరో 281 మంది ఇతర పోలింగ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. పెద్దేముల్ మండలంలో 272 పోలింగ్ బూత్‌లకుగాను 272 మంది పీఈఓలను 372 మంది ఓపీఓలు నలుగురు జోన్‌ల అధికారులు, ఆరుగురు రూట్ అధికారులు, 33 మంది స్టేజ్ - 2 ఆర్ఓలను నియమించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. ఎస్పీ స్నేహమేర ఎన్నికల సామగ్రిని

మిగతా 8వ పేజీలో...

సమన్వయంతో పని చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్‌జైన్


సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్/ బొంరాస్‌పేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం మొదటి విడత పంచాయతీ ఎన్నికల సందర్భంగా బుధవారం కొడంగల్, బొంరాస్‌పేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన వసతి కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఏవైనా సమస్యలుంటే వెంటనే తెలియజేయాలని కోరారు. ఆయన వెంటన తహసీల్దార్లు ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు ఉన్నారు. ఎన్నికల విధుల్లో సిబ్బంది, పీవోలు సొంత నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పని చేయాలన్నారు. బొంరాస్‌పేట్ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో రెండు గంటలైనా సిబ్బందికి బ్యాలెట్ బాక్సులు పంపిణీ చేయకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో వెంకన్నగౌడ్, తహసీల్దార్ పద్మావతి తదితరులు ఉన్నారు.


ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయాలి

- మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారుల ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జాతీయ రహదారుల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జాతీయ రహదారులకు సంబంధించి నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. రోడ్డు విస్తరణపై ఉన్న సమస్యలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పరిశీలించారు. అలాగే రోడ్డు విస్తరణకు సంబంధించిన కేసులతోపాటు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో జాప్యం లేకుండా వేగం పెంచాలని, దానికి కావాల్సిన చర్యలను సత్వరమే తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, జాతీయరహదారుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నిఘా నీడలో..

సమస్యాత్మక గ్రామాలు 123

సమస్యాత్మక స్థానాలు 684

- పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ భద్రత
- పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్
- సమస్యాత్మక గ్రామాల్లో కట్టుదిట్టం
- కోడ్ ఉల్లంఘిస్తే కేసుల నమోదుకు ఆదేశాలు

వికారాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రత పకడ్బందీగా ఉండేలా జిల్లా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి నువ్వా.. నేనా... అన్న విధంగా పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నేడు మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరగనుండగా.. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ అప్రమత్తంగా ఉండేలా పోలీసు శాఖ నిఘా పెంచింది.

ప్రత్యేక తనిఖీ బృందాల ఏర్పాటు

పోటీ ఉత్కంఠగా మారిన గ్రామాల్లో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. పంచాయతీ ఎన్నికల్లో గుర్తించిన సమస్యాత్మక గ్రామాల్లో వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. వెబ్ కాస్టింగ్ చేపట్టేందుకు అవకాశం లేని గ్రామాల్లో వీడియోగ్రాఫర్, ఐ ప్యాడ్ ద్వారా ఎన్నిక ప్రక్రిను మొత్తం వీడియో తీయించేలా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు వీలుగా చర్యలు చేపట్టారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా 20 ప్రత్యేక సంచార తనిఖీ

మిగతా 8వ పేజీలో...

అబ్బురం.. ఆశ్చర్యం

(ఐదో పేజీ తరువాయి)

శనివారం వరకు అనుమతించిన సంగతి తెలిసిందే. సమ్మిట్ ప్రాంగణంలోకి బుధవారం జనం తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని ప్రాంతాలను సందర్శించారు. అధికారులు ఎంపికచేసిన విద్యాసంస్థల నుంచి విద్యార్థులను ప్రత్యేక బస్సుల్లో తరలించారు. నగరశివారులోని పలు ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, తదితర వృత్తి విద్యాకోర్సుల విద్యార్థులు 2,500 మంది పాల్గొన్నారు. మరో 2వేల మంది ప్రజలు ఈ ప్రాంగణాన్ని సందర్శించారు. అలాగే పలువురు వ్యాపారవేత్తలు, చుట్టుపక్కల గ్రామస్తులు వేలాది మంది సందర్శించి, ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అధునాతన రోబోలు, త్రీడీ స్ర్కీన్లను వీక్షించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఉద్దేశాలను, ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఇక్కడ అధికారుల సందర్శకులకు వివరించారు. ఈ సందర్భంగా సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఏఐ రోబోలు, టచ్ కియోస్కులు, డిజిటల్ టన్నెల్, త్రీడీ తెరలు చూసి మంత్రముగ్ధులయ్యారు. స్టాళ్లు, హాళ్లను చూసి సందర్శకులు తన్మయత్వం చెందారు. తెలంగాణ రైజింగ్ థీమ్‌తో ఫ్యూచర్ సిటీతో పాటు



హైదరాబాద్‌లో యువత ఉపాధి అవకాశాలపై ప్రముఖులతో ప్రధాన హాల్లో సెమినార్లు నిర్వహించారు. విద్యార్థులకు స్టార్టప్‌లు, వ్యవసాయ పరంగా సాంకేతిక అభివృద్ధి, ఏఐ, అంశాలపై అవగాహన కల్పించారు.

సినీ హీరో దగ్గుబాటి రాణా రాకతో కేరింతలు

సెమినార్‌కు సినీ హీరో దగ్గుపాటి రాణా హాజరయ్యారు. ఆయన రాకతో విద్యార్థులు భల్లాలదేవా అంటూ కేరింతలు కొట్టారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా కష్టపడి చదువుకొని వివిధ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రభుత్వం ఉపాధి కోసం అవకాశాలు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా బోనాల ప్రదర్శన

సందర్శకులు, విద్యార్థులను ఆకర్షించేందుకు ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై టీజీఐఐసీకి చెందిన పలువురు వక్తలు సెమినార్‌ను నిర్వహించారు. భోజన సమయానంతరం జనగాం జిల్లా నుంచి వచ్చిన 12 మంది మహిళా కళాకారులు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా నిర్వహించిన బోనాల ప్రదర్శన, కోలాటాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. బోనాల పాటలు వింటూ విద్యార్థులు కేరింతలు కొట్టారు. కళాశాలల విద్యార్థినులు సెమినార్ హాల్‌లో నృత్యాలు చేశారు.

సందర్శకులకు ఉచిత రవాణా సౌకర్యం

గ్లోబల్ సమ్మిట్‌కు సందర్శకు కోసం ప్రభుత్వం ఉచితంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది. మొదటి రోజు రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకుల సౌకర్యార్థం రవాణా సౌకర్యం కల్పించారు. చెంగిచర్ల, హకీంపేట, ఉప్పల్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్, దిల్‌సుఖ్‌నగర్, జేబీఎస్ ఆర్టీసీ డిపోలకు చెందిన 52బస్సులతో పాటు 20ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేశారు. ప్రైవేటు కార్లు, ఇతరాత్ర వాహనాల్లో 5వేలకుపైగా సందర్శకులు హాజరయ్యారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఫ్యూచర్ సిటీ డెలప్‌మెంట్ అథారిటీ ఎండీ శశాంక, రాష్ట్ర ప్రొటోకాల్ ఇన్‌చార్జి వెంకట్‌నర్సింహారెడ్డి, ఆర్అండ్‌బీ ఎండీ అశోక్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎండీ ముష్రఫ్ అలీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తాగునీరు, భోజన వసతి

సందర్శకుల సౌకర్యార్థం సమ్మిట్ ప్రాంగణంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనవసతితో పాటు తాగునీటి వసతిని కల్పించారు. ముందుగా అంచనాకు మించి సందర్శకుల తాకిడి అధికంగా వచ్చారు. దీంతో భోజనం సరిపోకపోవడంతో పలువురు విద్యార్థులు, సందర్శకులు ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన స్టాళ్లలో స్నాక్స్ కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన రాచకొండ సీపీ

సీపీ సుధీర్‌బాబు భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. బుధవారం కూడా ప్రాంగణంలో పోలీసు యంత్రాంగాన్ని మోహరించారు. సమ్మిట్‌లోని స్టాల్స్, భోజన వసతి కల్పించిన స్థలాల గురించి పోలీసు సిబ్బంది సందర్శకులకు సమాచారం ఇచ్చారు. మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు ఉన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థి చేసిన సైకిల్

నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి గగన్‌చంద్ర తయారు చేసిన సోలార్ బ్యాటరీ సైకిల్ గ్లోబల్ సమ్మిట్ సందర్శకులను ఆకట్టుకుంది. ఇందుకు రూ.25వేల ఖర్చు చేశాడు. సైకిల్‌కు ఎక్కడైనా ప్రమాదం జరిగితే తెలియజేయడానికి ఫోన్ చేసే వసతి ఉండటం చూసి పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న మల్టీపర్పస్ అగ్రికల్చర్ యంత్రం

సమ్మిట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో ఆదిలాబాద్‌కు చెందిన మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే కళాశాలకు చెందిన విద్యార్థులు రనూష, వైష్ణవి తయారు చేసిన మల్టీపర్పస్ అగ్రికల్చర్ యంత్రం సందర్శకులను ఆకట్టుకుంది. దీన్ని రూ.15వేలతో చేశామని, ముందు వరుసలో నాగలితో దున్నేందుకు, వెనుక వరుసలో ప్లవ్‌తో దుక్కిని దున్నే అవకాశం ఉందని విద్యార్థినులు వివరించారు.

తీరొక్కటొస్తున్నయని ఇక్కడకొచ్చినంక తెలిసింది



మా ఊరు దగ్గర్లో పొలాల్లో ఏదో పెద్ద ప్రోగ్రామంటని తెలిసి ఈడికి వచ్చినం. ఇక్కడ పెద్ద కంపెనీలు, కాలేజీలు, ఆటలాడేవి ఇట్లా తీరొక్కటి వస్తున్నయని ఇక్కడికి వొచ్చినంక తెలిసింది అని అంటున్నారు కందుకూరు మండలం ఆకులమైలారానికి చెందిన అనెమోని మంజులవాణి, గౌర అనిత. భారత్ ఫ్యూచర్ సిటీ కని మా పొలాలు తీసుకుండ్రు.. ముందు మాకేం అర్థం కాలే. ఇక్కడ చూస్తే రంగుల ప్రపంచం కనిపిస్తుంది. ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులలతో పాటు పెద్ద కంపెనీలకు చెందినోల్లు వచ్చిండ్రని మా పిల్లలు సెల్‌ఫోన్లల్ల చూపిచ్చిండ్రు. ఇదేదో ఫోన్లల్లకంటే ఆడికి పోయి చూస్తమని వచ్చినం. ఇవన్నీ చూస్తుంటే మా పొలాలు పోయినా మా పిల్లలకు కొలువులొస్తయన్న ధీమా వచ్చిందన్నారు. రెండ్రోజుల నుంచి ఇల్లెక్కి చూస్తున్నం. ఆ లైట్లు. ఆ ఫోకస్‌లు జిగేల్ జిగేల్‌మంటున్నయ్. ఇక్కడ పెద్ద కంపెనీలొస్తే మా ఊరు రూపు రేఖలు మార్తయని అంతా అనుకుంటుండ్రు అని మంజుల, అనిత చెప్పారు.

- పలువురు మహిళలు, ఆకులమైలారం

ఈ సమ్మిట్ తెలంగాణ భవిష్యత్తును ఆవిష్కరించింది



ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అద్భుతం. ప్రభుత్వాధినేతలు, ప్రముఖులు పాల్గొన్న ఈ సమ్మిట్ తెలంగాణ భవిష్యత్తును ఆవిష్కరించింది. ప్రభుత్వం ఏం చేయబోతుంది.. అడ్వాన్స్ టెక్నాలజీతో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలకు సంబంధించి ప్రముఖ సంస్థల డెలిగేట్స్ ప్రభుత్వంతో ఒప్పందాలు(ఎంవోయూ) చేసుకోవడం మంచి పరిణామం. ఇది విద్యార్థులకే కాదు.. మా లాంటి లెక్చరర్లకు కూడా ఒక అవగాహన వచ్చింది. మీడియాలో చూసింది ఒక భాగమైతే ఇక్కడ ఫీల్డులో చూడడమనేది కళ్లకు కట్టినట్టుగా ఉంది.

- ఫ్లోరెన్సీ, సిటీ కాలేజీ లెక్చరర్, హైదరాబాద్

మాకు ఇది ఒక పాఠంగా భావిస్తున్నాం



ఎక్కడో పొలాల్లో ఫ్యూచర్ సిటీ ఏర్పాటు అంటే ఏదో అనుకున్నం. ప్రభుత్వం, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్న ఈ సమ్మిట్‌ను మేమొక పాఠంగా భావిస్తున్నాం. పుస్తకాలు తిరిగేయడం వేరు.. ఇక్కడ మేం చాలా విషయాలు తెలుసుకున్నం. వివిధ రంగాలకు చెందిన స్టాళ్లు కూడా ఆకట్టుకున్నయ్. ముఖ్యంగా ఇక్కడ ఏర్పాటయ్యే పరిశ్రమలను చూస్తే మున్ముందు యువతకు ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు రావడానికి ఇది దోహదం చేస్తుందని చెప్పవచ్చు. ఇది ఒక రకంగా స్ఫూర్తినిచ్చేదిగా ఉంది.

- ఐశ్వర్య, డిగ్రీ మొదటి సంవత్సరం, సిటీ కాలేజి

ఆనందంగా ఉంది



ఫ్యూచర్ సిటీ దగ్గర చూస్తే ఆనందంగా ఉంది. మాకిది కొత్తగా కనిపిస్తుంది. చూద్దామని వచ్చినం.. సెల్ఫీ తీసుకుని మా పిల్లలకు, సుట్టుపక్కల వాళ్లకు చూపిస్త..

- లక్ష్మి, మంగల్‌పల్లి, ఆమనగల్లు మండలం

నాయకుల కనుసన్నల్లో జీపీ ఎన్నికలు!

● రెబల్స్‌పై పార్టీల సస్పెన్షన్ వేటు





యాచారం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తిగా రాజకీయ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నాయి. చాలా గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులను పార్టీల నాయకులే ఎంపిక చేశారు. గురువారం మొదటి విడత జరుగుతున్న ఎన్నికలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. యాచారం బీఆర్ఎస్ మాజీ జెడ్పీటీసీ దంపతులు కాంగ్రెస్ అభ్యర్థులకు సపోర్ట్ చేయడంతో వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. మేడిపల్లిలో బీఆర్ఎస్ రెబల్ నామినేషన్ వేయడంతో ఐదుగురిని సస్పెండ్ చేశారు. మొండిగౌరెల్లిలో బీజేపీకి చెందిన ఇద్దరు నాయకులు తమ కుటుంబానికి చెందిన మహిళలను బరిలో దింపారు. మాల్‌లో ఇద్దరు కాంగ్రెస్ నాయకులు బరిలో నిలిచారు. రెండు రోజుల్లో రెబల్స్ బరి నుంచి తప్పుకోకుంటే సస్పెండ్ చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఎక్కువ సర్పంచ్ స్థానాల్లో గెలిస్తే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సొసైటీ పదవుల కైవసం సులువవుతుందని ప్రధాన పార్టీల నాయకులు భావిస్తున్నారు. కాగా, ఫార్మాసిటీ బాధిత గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక దృష్టి సారించారు

ఎన్నికల విధులకు టీచర్ల డుమ్మా

● నాలుగు మండలాల్లో 245 మంది గైర్హాజరు
● డ్యూటీకి రాని వారిని సస్పెండ్ చేస్తామన్న ఎన్నికల నోడల్ అధికారి



మైకులో ఎన్నికల సిబ్బందిని పిలుస్తున్న నోడల్ అధికారి సుశీంద్రరావు

షాద్‌నగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను ప్రభుత్వ ఉపాధ్యాయులు పట్టించుకోలేదు. ఎన్నికల విధులకు కొందరు రాలేదు. రిజర్వ్‌లోని ఉపాధ్యాయులు సైతం ఎలక్షన్ విధులకు ఎగనామం పెట్టారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల అధికారులు మైకుల్లో పిలిచినా వా రు రాకపోవడంతో అప్పటికప్పుడు ఎలాంటి శిక్షణ లేని ప్రైవేటు టీచర్లకు ఎన్నికల విధులను అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా ఎన్నికల నోడల్ అధికారి, డీఈవో సుశీంద్రరావు తీవ్రంగా స్పందించారు. విధులకు హాజరుకాని వారిని ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తామని ప్రకటించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఎన్నికల విధులకు హాజరుకావాలనున్నా సమాచారమైనా ఇవ్వకుండా రాకపోవడం నిబంధనల ఉల్లంఘనేనని అధికారులు మండిపడ్డారు.

విధులకు 245 మంది ఎగనామం

షాద్‌నగర్ నియోజకవర్గంలో 245 మంది ఎన్నికల విధులకు డుమ్మా కొట్టారు. ఉదయం 9గంటల నుంచే మండల కేంద్రాల్లో ఎన్నికల ఏర్పాట్లు చేశారు. 10గంటలకల్లా ఎన్నికల డ్యూటీ ఉన్నవారంతా రిపోర్ట్ చేయాలని జిల్లా నోడల్ అధికారి సుశీందర్ రావు ఆదేశించారు. సాయంత్రం నాలుగైనా కొందరు రిపోర్ట్ చేయలేదు. ఫోన్లకూ స్పందించలేదు. మైకుల్లో పేర్లతో పిలిచినా హాజరుకాలేదు. రిజర్వ్ సిబ్బంది కోసం అనౌన్స్ చేసినా వారిలో సగం మంది కూడా ఎన్నికల విధులకు రాలేదు. ఫరూఖ్‌నగర్ మండలంలో 120, కొత్తూరు మండలంలో 25 మంది, నందిగామ మండలంలో 20 మంది, చౌదరిగూడ మండలంలో 80 మంది చొప్పున ఉపాధ్యాయులు పంచాయతీ ఎలక్షన్ విధులకు హాజరు కాలేదు.

సంగ్రామం 2025

www.andhrajyothy.com



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అధికారి కుసుమ మాధురి

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ఆమనగల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు ఆమనగల్లు మండలంలో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా ఎన్నికల సహాయ అధికారి కుసుమ మాధురి తెలిపారు. బుధవారం మేడిగడ్డ తండా పోలింగ్ బూత్‌ను ఆర్వో అనంతరెడ్డితో కలిసి ఆమె సందర్శించారు. వసతులను పరిశీలించి పోలింగ్ స్టేషన్ నంబర్లను వేయించారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు తగిన ఏర్పాట్లుచేయాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. మండలంలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 92 పోలింగ్ బూత్‌లను ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్ల స్వీకరణ ..

మండల పరిషత్‌లో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మాధురి తెలిపారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ఆర్వో రమాదేవి పోస్టల్ బ్యాలెట్లను స్వీకరిస్తారని చెప్పారు. సర్వీస్ ఓటర్లు, జవాన్లు, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగం చేసే ఇక్కడి ఓటర్లు, ఎన్నికల డ్యూటీ పడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

ప్రజా భాగస్వామ్యంతోనే శాంతి

● రాష్ట్రపతి కార్యాలయ మాజీ ఓఎస్డీ సత్యనారాయణ సాహు



పుస్తకావిష్కరణ చేస్తున్న సత్యనారాయణ సాహు, లింబాద్రి తదితరులు

చేవెళ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిజమైన శాంతి ప్రభుత్వాలు, ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యం అని రాష్ట్రపతి కార్యాలయ మాజీ ఓఎస్డీ, ప్రెస్ సెక్రటరీ సత్యనారాయణ సాహు అన్నారు. బుధవారం చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో.. 'సంయుక్త రాజ్య సమితి ఎస్‌డీజీ-16శాంతి, న్యాయం, బలమైన సంస్థలు' అనే అంశాలపై జాతీయ సదస్సు నిర్వహించారు. మొదటి రోజు గురువారం సత్యనారాయణ సాహు, తెలంగాణ ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ఆర్.లింబాద్రి, ప్రొఫెసర్లు ఎం.రాములు, కె.ముత్యంరెడ్డి, సురేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, ఎం.గంగాధర్, అలీంఖాన్‌పలాకీ, నర్సయ్య హాజరయ్యారు. పుస్తకావిష్కరణ చేశారు. విద్యావేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని సామాజిక రాజకీయ అంశాలపై చర్చించారు. సత్యనారాయణ సాహు మాట్లాడుతూ.. ఢిల్లీ పరిస్థితులతో పోల్చితే చేవెళ్లలో స్వచ్ఛమైన గాలి ఉందన్నారు. కాలుష్యంతో ఢిల్లీలో ఎయిర్ ప్యూరిఫయర్లు అవసరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. శుభ్రమైన గాలి పొందడం ప్రాథమిక న్యాయం అన్నారు. మహిళల భద్రత, గౌరవం అవకాశాలు కర్తవ్యాలని తెలిపారు. అంతకు ముందు ఆర్.లింబాద్రి మాట్లాడుతూ.. బలమైన సంస్థల నిర్మాణానికి ఆత్మ, శాంతి, కరుణ ముఖ్యమన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ఎస్‌డీజీ-16 ఆత్మగా రాజ్యాంగం నైతిక నిర్మాణానికి ఆధారమని వివరించారు. ప్రిన్సిపాల్ కాంచనలత, సదస్సు కన్వీనర్ అబ్దుల్ మాలిక్, అధ్యాపకులు కవిత, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలి పంజా

(ఐదో పేజీ తరువాయి)

అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 6.9 డిగ్రీలు, మేడ్చల్ జిల్లా ఉప్పల్‌లో 9.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గడిచిన ఐదేళ్లలో ఇక్కడ ఇవే కనిష్ఠ ఉష్ణోగ్రతలు కావడం గమనార్హం. చలిగాలుల ఉధృతి పెరిగి రాత్రిళ్లు జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో సాయంత్రమే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. తెల్లవారు జామున మంచు విపరీతంగా కురుస్తోంది. ఉదయం వేళ మంచు రహదారులను కప్పేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు 5 డిగ్రీలకు పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

● పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి
● మొదటి విడత తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోని 8 మండలాల్లో పోలింగ్ : వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



తాండూరులో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

తాండూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):వికారాబాద్ జిల్లా తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో మొదటివిడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా 8 మండలాల్లోని 225 గ్రామ పంచాయతీలు, 1,112 వార్డుల్లో గురువారం(నేడు) పోలింగ్ నిర్వహిస్తున్నామని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం తాండూరు మండల పరిషత్ వద్ద ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూటషన్ కేంద్రాన్ని, పోలింగ్ సిబ్బందికి అందజేస్తున్న ఎన్నికల సామాగ్రిని ఆయన పరిశీలించారు. ఎన్నికలు ఎలా నిర్వహిస్తారనే విషయమై పలువురు ప్రిసైడింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్‌కు ముందే అన్ని అంశాలపై ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేయాలని ఆయన సూచించారు. మండలాల్లో పోలింగ్‌ను ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని చెప్పారు. వారితో జోన్ ఆఫీసర్లు ఎన్నికల సరళిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ గ్రామాల్లో నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించామని చెప్పారు. సిబ్బంది సౌకర్యవంతంగా పని చేసేలా, అలాగే ఓటర్లు ప్రశాంతంగా ఓటు వేసేలా చర్యలు చేపట్టామన్నారు. అం దరూ తమ ఓటు హక్కును వినియోగించాలని సూచించారు. ఎన్నికలకు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు కలెక్టర్ చెప్పారు.

అభ్యర్థుల్లో టెన్షన్..

● రంగారెడ్డి జిల్లా 7 మండలాల్లో నేడు ఎన్నికలు
● తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
● అందలమెక్కేదెవరో?
● అప్పుల్లో కూరుకుపోయేవారెందరో?!



షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమై కునుకు లేకుండా రాత్రింబవళ్లు బీజీగా గడిపిన అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. గురువారం ఉదయం 7గంటల నుంచి మొదలవనున్న మొదటి విడత ఎన్నికల్లో ఓటర్లు ఎవరిని కరుణిస్తారోనన్న భయం పట్టుకుంది. ప్రచారంలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వివిధ ప్రలోభాలకు గురి చేస్తూ మందు, విందులు ఏర్పాట్లు చేసి.. డబ్బులు, కానుకలు పంచారు. ఓటర్ల కాళ్లపై పడి వేడుకున్నారు. ఇలా ఎన్ని చేసినా చివరకు పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఎవరి గుర్తుకు ఓటేస్తారోననే భయం అభ్యర్థులందరికీ పట్టుకుంది. మరి కొన్ని గంటల్లోనే వారి రాజకీయ భవితవ్యం తేలనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి అభ్యర్థులు ఎన్నికల ఖర్చు చేశారు. గెలిచిన వారి పరిస్థితి ఎలా ఉన్నా ఓడిన వారు మాత్రం చాలా మట్టుకు అప్పులపాలు అవుతారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. రంగారెడ్డి జిల్లాలో ఏడు మండలాల్లో గురువారం పోలింగ్ జరగనుంది. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూర్, కొందుర్గు, కేశంపేట, ఫరూఖ్‌నగర్, నందిగామ, జిల్లేడ్‌చౌదరిగూడ, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మండలం 168సర్పంచ్ పదవులకు 530 మంది, అలాగే 1,340 వార్డు పదవులకు 3,379 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు.

పోటీ ప్రతిష్ఠాత్మకం...

● గ్రామాల్లో భారీగా ఎన్నికల హామీలు
● లక్షల్లో ఖర్చు చేస్తున్న అభ్యర్థులు



మొయినాబాద్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల పోటీలోని అభ్యర్థులు రాజకీయ పార్టీలను మించి హామీలు గుప్పిస్తున్నారు. వివిధ పథకాలను వర్తింపజేస్తామంటూ ప్రకటిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చినా రాకున్నా తామే సొంతంగా గ్రామాభివృద్ధికి ఎంతైనా ఖర్చు చేస్తామని గ్రామస్తులకు హామీ ఇస్తున్నారు. ఇవన్నీ ఇప్పుడు ఎన్నికల్లో వెచ్చిస్తున్న డబ్బుకు అదనమే. ఎందుకంటే ఎన్నికల్లో ఎంత వెచ్చించినా గెలిచిన తరువాత హామీల అమలుకు సైతం భారీ మొత్తమే వెచ్చించాల్సి ఉంటుంది. మండలంలోని ఓ గ్రామంలో సర్పంచ్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థిని 'ప్రజలే నా బలం.. యువతే నా సైన్యం.. గ్రామాభివృద్ధే నా ధ్యేయం' అని మ్యానిఫెస్టో ప్రకటించారు.

గ్రామస్తులకు ఇస్తున్న హామీలివీ..

- పుణ్యవతి తల్లి దీవెన పేరిట గ్రామంలోని ప్రతీ ఆడపడచు వివాహానికి రూ.41వేల ఆర్థిక సహాయం.
- ప్రజలకు ఉచితంగా నీరందించేందుకు వాటర్ ప్లాంటు ఏర్పాటు. ఉచిత అంబులెన్స్ సౌకర్యం.
- గ్రామంలో జన్మించిన ప్రతి శిశువుకు రూ.11వేల అందజేత. కొత్త పంచాయతీ, డ్వాక్రా భవనాల నిర్మాణం.
- గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు. గ్రామస్తులకు ఉచిత వైఫై వసతి వంటి హామీలు గుప్పిస్తున్నారు.

ఉప సర్పంచ్‌ల ఎన్నిక ప్రక్రియ పూర్తి



ఏకగ్రీవమైన సర్పంచ్ మాధవి, ఉపసర్పంచ్ శివకుమార్, వార్డు సభ్యులు

కులకచర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏకగ్రీవమైన నాలుగు గ్రామాల్లో బుధవారం అధికారులు ఉపసర్పంచ్‌ల ఎన్నిక నిర్వహించారు. తిరుమలాపూర్ ఉపసర్పంచ్‌గా శివకుమార్, దాస్యనాయక్ తండా సూరిబాయి, బోట్యానాయక్‌తండా ప్రకాశ్, ఎత్తుకాల్వతండా ఉప సర్పంచ్‌గా జ్యోతిలు ఎన్నికయ్యారు. మండలంలో 33 పంచాయతీలకు 4 ఏకగ్రీవమయ్యాయి. మరో 29 పంచాయతీలకు 80మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 280వార్డులకు 80 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 200 వార్డులకు 540 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలి



ఎన్నికల బందోబస్తుపై పోలీసులకు సూచనలు ఇస్తున్న డీసీపీ రాజేశ్

నందిగామ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ అన్నారు. బుధవారం నందిగామలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎన్నికల నిర్వహణపై పోలీసులకు సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం ఒక ఏసీపీ, ఇద్దరు సీఐలు, 20 మంది వెపన్ పార్టీ పోలీసులు, 200 మంది సాధారణ పోలీసులను పోలింగ్ కేంద్రాల వద్ద నియమించినట్లు వివరించారు. నందిగామ, మొదళ్లగూడ, మామిడిపల్లి గ్రామాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించినట్లు డీసీపీ వెల్లడించారు. ప్రజలు పోలింగ్ కేంద్రానికి 200మీటర్ల దూరంలో ఉండాలని సూచించారు. ఓటర్లు పోలింగ్ బూత్‌లలోకి సెల్‌ఫోన్, వాటర్ బాటిల్స్ తీసుకు రావొద్దని తెలిపారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు ఊరేగింపులు తీయకూడదని, బాణసంచా కాల్చొద్దని పేర్కొన్నారు. ఎవరైనా కించపరిచే వ్యాఖ్యలు చేయడం, గొడవలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కొత్తూర్: ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని డీసీపీ రాజేష్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు తప్పవన్నారు. ఏసీపీ గంగాధర్, ఇన్‌స్పెక్టర్ నర్సయ్య, పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

షాద్‌నగర్ రూరల్: పంచాయతీ ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలని శంషాబాద్ అడిషినల్ డీసీపీ పూర్ణచందర్ సూచించారు. పట్టణంలోని ఓ గార్డెన్‌లో మంగళవారం పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ మొదలు ఫలితాలు వెలువడే వరకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలో ఇద్దరు ఏసీపీలు, పది మంది సీఐలు, 30మంది ఎస్సైలు, 500 మందికిపైగా పోలీసులు విధుల్లో ఉంటారని తెలిపారు.



మాట్లాడుతున్న అడిషినల్ డీసీపీ పూర్ణచందర్

ప్రగతి నిరోధకులకు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



చరికొండ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ తోనే సామాజిక న్యాయం, గ్రామాల అభివృద్ధి సాధ్యం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. చరికొండ, పల్లెచెలుకతండా, చింతలపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల తరపున ప్రచారంలో పాల్గొన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో ఎంతో ప్రగతి జరిగిందన్నారు. ఓర్వలేని అవకాశవాదులు, అభివృద్ధి నిరోదకులకు ప్రజలు ఓటు వెయ్యకుండా గుణపాఠం చెప్పాలన్నారు. నియోజకవర్గంలో 90శాతం పంచాయతీల్లో కాంగ్రెస్ మద్దతుదారుల విజయం ఖాయం అన్నారు. ప్రజల కోసం పాటుపడేవారినే సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు బీచ్యానాయక్, జగన్, నాయకులు హన్మనాయక్, పాలకూర్ల రాములు, వెంకటయ్య, అంజి, సత్యం, నర్సింహ, లక్ష్మమ్మ, రమేశ్, బాల్‌రాజ్, దీప్లా ఉన్నారు.

నేనూ సత్యసాయి భక్తుడినే ...

● స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



రథయాత్రను ప్రారంభిస్తున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాను కూడా భగవాన్ శ్రీ సత్యసాయి బాబా భక్తుడనేనని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం పుట్టపర్తి ప్రేమ ప్రవాహిని రథం పుట్టపర్తి నుంచి వికారాబాద్‌లోని భగవాన్ శ్రీ సత్యసాయి జ్ఞాన కేంద్రానికి చేరుకుంది. ఈ రథాన్ని పట్టణంలో యాత్ర నిర్వహించగా స్పీకర్ ముఖ్య అతిథిగా హాజరై యాత్రను ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్పీకర్ మాట్లాడుతూ.. సత్యం ధర్మ శాంతి ప్రేమ అహింస ఐక్యత వంటి బాబా తెలిపిన సందేశాలను వ్యాప్తి చేయడమే ఈ రథ యాత్ర ఉద్దేశమన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే చాలా దేశాల్లో ప్రేమ శాంతి సమైక్యత పెంపొందించడంలో సత్యసాయి కృషి చేశారని, దేశంలో అనేక గ్రామాలు పట్టణాల్లో సత్యసాయి కేంద్రాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎల్లప్పుడూ జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. రథయాత్ర ప్రశాంతి నగర్ నుంచి ప్రారంభమై జగ్జీవన్‌రామ్ చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా బసవేశ్వర చౌరస్తా శ్రీ రామ మందిర్‌ల నుంచి మల్లికార్జున ఆలయం మీదుగా అంబేడ్కర్ చౌరస్తా నుంచి తిరిగి సత్యసాయి జ్ఞాన కేంద్రానికి చేరుకుందని కన్వీనర్ సత్యనారాయణగౌడ్ తెలిపారు. రథయాత్రలో సేవాదళ్ సభ్యులు భక్తులు, మహిళలు, విద్యార్థులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. భజనలు, కోలాటంతో వెళ్లారు. కార్యక్రమంలో తాండూరు, కేరెళ్లి, వికారాబాద్, పరిగి, రంగాపూర్, మాదారం కొడంగల్ నుంచి వచ్చిన సత్యసాయి సేవా సమితి కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు. అంతే కాకుండా పుర ప్రముఖులు మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ మంజుల, వి.సత్యనారాయణ, జగదీశ్వర్‌సింగ్, స్పిరిచ్యువల్ కో-ఆర్డినేటర్ బందప్పగౌడ్, యూత్ కోఆర్డినేటర్ బసవేశ్వర్, మహిళా కార్యకర్తలు అనురాధ, కే.వర్ధిని, సత్యనారాయణ పాల్గొన్నారు.

పండుగల సాయన్న ఆశయాలను సాధిద్దాం

చేవెళ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పోరాటా యోధుడు పండుగల సాయన్న ఆశయ సాధనకు కృషిచేస్తామని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ తెలిపారు. సాయన్న వర్ధంతి సందర్భంగా బుధవారం చేవెళ్లలోని విగ్రహానికి నివాళులు అర్పించారు. పోరాట యోధుడు పండుగల సాయన్న చూపిన మార్గంలో పయనిస్తున్నట్లు చెప్పారు. చరిత్రలో పండుగల సాయన్నకు సముచితస్థానం ఉందన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ తలారి మల్లేష్, చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామెన భీం భరత్, ముదిరాజ్ సంఘం చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాధ్యక్షులు నర్సింలు, మైసయ్య, నాయకులు శివారాజ్, శ్రీకాంత్, గోపాల్, శ్రీరామ్‌లు, శ్రీనివాస్, రాంప్రసాద్, నర్సింలు, రాజశేఖర్, జంగయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



సాయన్న విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్ వైద్యుడికి జాతీయ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ వంశీ కేశవరం

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ రంగరాయ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ వంశీ కేశవరం జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఢిల్లీలో బుధవారం కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తరఫున బిహార్ మంత్రి జివేష్ మిశ్రా నుంచి వంశీ రాష్ట్రీయ చికిత్సా సేవాశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ సేవలకిచ్చే అవార్డిది.

నిఘా నీడలో..

(ఐదో పేజీ తరువాయి)

బృందాలను నియమించారు. విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టనున్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు బలగాలు

జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా పోలింగ్ జరిగేందుకు వీలుగా సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు బలగాలను పెద్దఎత్తున మొహరించేలా చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 123 సమస్యాత్మక గ్రామాలు ఉండగా, వాటి పరిధిలో 684 స్థానాలు సమస్యాత్మకమైనవిగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరిగే పంచాయతీల్లో 53 సమస్యాత్మక స్థానాలు ఉన్నాయి. సమస్యాత్మక గ్రామాల్లో జరిగే ఎన్నికల పోలింగ్‌ను వెబ్‌కాస్టింగ్ చేయనున్నారు. వెబ్‌కాస్టింగ్ చేయడానికి నెట్‌వర్క్ సహకరించని పోలింగ్ కేంద్రాల్లో ఐప్యాడ్, వీడియోగ్రఫీ ద్వారా పోలింగ్ ప్రక్రియ మొత్తం చిత్రీకరించనున్నారు. ఈ గ్రామాల్లో పోలింగ్ ప్రక్రియ పరిశీలించేందుకు సూక్ష్మ పరిశీలకులను నియమించారు. వీరు తమకు కేటాయించిన గ్రామాల పరిధిలో పోలింగ్ ప్రక్రియను రికార్డు చేయనున్నారు. ఎన్నికల సమయంలో అనుకోని సంఘటనలు ఉత్పన్నమైతే ఈ కెమెరాలు ప్రత్యక్ష సాక్ష్యంగా పనిచేయనున్నాయి.


పెద్దేముల్ మండలంలో ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్పీ స్నేహమెహ్రా

భద్రత కట్టుదిట్టం

జిల్లాలో మూడు విడతల్లో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగం పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టింది. పోలింగ్‌కు ముందు, పోలింగ్, ఓట్ల లెక్కింపు అనంతరం కూడా శాంతి భద్రతలకు సంబంధించి ఎలాంటి విఘాతం కలుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి మండలంలో ముగ్గురు ఎస్‌ఐలు, ఒక ఇన్‌స్పెక్టర్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. ప్రతి రెండు మండలాలకు ఒక డీఎస్పీని కేటాయించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా నేతృత్వంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షించనున్నారు. ఒక్కో విడత పంచాయతీ ఎన్నికలకు 1,100 మంది పోలీసు అధికారులు, సిబ్బంది సేవలను బందోబస్తుకు వినియోగించుకోనున్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం గ్రామాల్లో ఎలాంటి అలజడులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకునేలా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

పెద్దేముల్: వికారాబాద్ జిల్లాలో తొలివిడత ఎన్నికలు ప్రశాంతంగా జరిపించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎస్పీ స్నేహమెహ్రా అన్నారు. మండల కేంద్రంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం సందర్శించి అధికారులతో మాట్లాడారు. పోలింగ్ సిబ్బందిని తరలించే బస్సులను బందోబస్తు గురించి తాండూరు డీఎస్పీ నర్సింగ్‌యాదయ్యతో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. జిల్లాలో తొలివిడత జరుగుతున్న 8 మండలాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిపిస్తామని చెప్పారు. భద్రతా ఏర్పాట్ల కోసం 1200 మంది పోలీస్‌సిబ్బందిని నియమించామని చెప్పారు.

స్వేచ్ఛగా ఓటు వేయాలి

వికారాబాద్: పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీగా భద్రత ఏర్పాట్లు చేశాం. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. జిల్లాలో రౌడీ షీటర్లు, సస్పెక్ట్‌లు, ట్రబుల్ మంగర్‌లను బైండోవర్ చేశాం. లైసెన్స్ పొందిన తుపాకులు, ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాం. సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత ప్రచారాలు చేస్తే కేసులు నమోదు చేస్తాం. పోలింగ్ కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి లేదు. ఎక్కడైనా అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తే వెంటనే పోలీసులుకు, లేదా కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలి.

- స్నేహ మెహ్రా, వికారాబాద్ ఎస్పీ

ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి

కులకచర్ల: పంచాయతీ పోరులో బరిలో నిలిచిన అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పోటీలో ఉన్న సర్పంచ్, వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రచార సమయంలో పోస్టర్‌లు, పంప్లెట్లు, వాల్ పెయింటింగ్, ప్రింటర్ పేరు, చిరునామా, కాపీల సంఖ్య తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎన్నికల ఖర్చు కచ్చితమైన పరిమితిలోనే ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీవో శ్రీకాంత్ ఉన్నారు.

క్రైం కార్నర్

గృహిణి అదృశ్యం


భవాని (ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఓ గృహిణి అదృశ్యమైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం ఇన్ఫోసిస్ సమీపంలోని డబుల్ బెడ్‌రూంలో నివాసముంటున్న గట్టు రాజుకు నగరంలోని పాతబస్తీకి చెందిన భవాని(28)తో 2014లో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. గత నెల 14వ తేదీన పాతబస్తీలోని తల్లిగారి ఇంటికి వెళ్తున్నానని ముగ్గురు పిల్లలను తీసుకొని వెళ్లింది. కానీ అమ్మగారి ఇంటికి వెళ్లకుండ జియాగుడలోని బంధువులైన యశ్వంత్ ఇంటికి వెళ్లి పిల్లలను దింపి అక్కడి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో యశ్వంత్ గట్టు రాజుకు ఫోన్‌చేసి భవాని ముగ్గురు పిల్లలను తన ఇంట్లో వదిలిపెట్టి వెళ్లిందని చెప్పాడు. అప్పటి నుంచి భవాని కోసం భర్త బంధువులు, తెలిసిన వారిని, మిత్రులకు ఫోన్ చేసినా ఫలితం లేకపోవడంతో పోచారం ఐటీ కారిడార్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక లారీ బోల్తా


ఘట్‌కేసర్ బైపాస్‌లో బోల్తా పడిన ఇసుకలారీ

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇసుక లారీ బోల్తాపడిన సంఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. భద్రాచలం నుంచి ఇసుక లోడుతో వస్తున్న లారీ వరంగల్ -హైదరాబాద్ జాతీయ రహదారి ఘట్‌కేసర్ బైపాస్ వద్దకు రాగానే బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ తలకిందులుగా పడింది. డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లడం వల్లే లారీ బోల్తా పడిందని స్థానికులు భావిస్తున్నారు. లారీ యజమాని ఇసుకను మరో లారీలో తరలించారు. ఈ విషయంపై ఫిర్యాదు అందలేదని సీఐ బాలస్వామి తెలిపారు.

బస్సులు లేక ప్రయాణికులకు ఇక్కట్లు

వికారాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తొలి విడత పంచాయతీ ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు బుధవారం ఆర్టీసీ బస్సులను తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోని మండలాలకు తరలించారు. వికారాబాద్, తాండూరు డిపోల్లో ఉన్న బస్సుల్లో సగం వరకు బస్సులను ఎన్నికల సిబ్బందిని గ్రామాలకు తరలించేందుకు ఆర్టీసీ అధికారులు పంపించారు. చాలా వరకు ప్రధాన మార్గాల్లోనే బస్సులు నడిపించారు. గ్రామాలకు నడిచే బస్సులను రద్దు చేశారు. దీంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పలేదు. బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు పడ్డ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తప్పని పరిస్థితుల్లో కొందరు ఆటోలు, ఇతర వాహనాలను ప్రత్యేకంగా అద్దెకు తీసుకుని తమ గ్రామాలకు వెళ్లారు. ఆర్టీసీ అధికారులు ఆదాయంపై కనబరిచే శ్రద్ధ ప్రయాణికుల సౌకర్యంపై కనబరచడం లేదని మండిపడ్డారు.

'ఇన్నోవేషన్'లో యువత ప్రతిభ ప్రపంచానికే ఆదర్శం


విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న ఏఐసీటీఈ వైస్ చైర్మన్ అభయ్ జేరే

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇన్నోవేషన్ రంగంలో భారత యువత చూపిస్తున్న ప్రతిభ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుంది ఏఐసీటీఈ (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) వైస్‌చైర్మన్ అభయ్‌జేరే తెలిపారు. అంకుషాపూర్‌లోని ఏస్ ఇంజనీరింగు కళాశాలలో ముగిసిన 8వ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని గెలుపొందిన విద్యార్థులు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకారంతో 36 గంటల పాటు కొనసాగిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ప్రపంచంలోకెల్లా అతిపెద్ద హ్యాకథాన్ అన్నారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాలుగు జట్లకు ఆయన రూ.6లక్షల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏస్ కళాశాల కార్యదర్శి వైవీ గోపాలకృష్ణమూరి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, సీవోవో రఘువంశీ, హెచ్‌వోడీలు సారథి, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతిరెడ్డిని కలిసిన సర్పంచ్, వార్డుసభ్యులు

కొడంగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టేకుల్‌కోడ్ గ్రామంలో ఏకగ్రీవమైన సర్పంచ్ అభ్యర్థి చింతకింది రాజు, వార్డు సభ్యులు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డిని కలిశారు. బుధవారం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి తిరుపతిరెడ్డిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోచారంను రెండు వార్డులుగా విభజించాలి

ఘట్‌కేసర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఎల్‌బీనగర్ జోన్‌లోని పోచారం సెక్టార్‌ను రెండు వార్డులుగా విభజించాలని బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఒకే వార్డుగా ఉండటం వల్ల ప్రజలకు అనేక రకాల ఇబ్బందులు తలెత్తే ప్రమాదముందన్నారు. పోచారం సెక్టార్ 50చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి 60వేల ఓటర్లు కలిగి ఉన్నారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, నర్రి కాశయ్య, మోటుపల్లి శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ సభ్యుడు అక్రం అలీ ఉన్నారు.

సంక్షిప్తంగా..

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

వికారాబాద్: ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవల అధికారం ఆధ్వర్యంలో సక్సెస్ స్కూల్, జడ్పీహెచ్‌ఎస్ కొత్తగడిలో లీగల్ అవేర్‌నెస్ క్యాంపు నిర్వహించారు. ప్రధాన అతిథిగా పాల్గొన్న కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు చట్టాలపై అవగాహన కల్పించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

ధారూరు: మండలంలోని ధర్మాపూర్ గ్రామంలో బుధవారం అయ్యప్ప స్వామి మహాపడి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి వస్త్రాలతో అయ్యప్ప స్వాములు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

ఆర్థిక సాయం

బొంరాస్‌పేట్: మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ కార్యకర్త ప్రతాప్ భార్య విజయలక్ష్మి ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు బాబయ్యానాయుడు, శాంతకుమార్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

పండుగ సాయన్న 135వ వర్ధంతి

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్, అంకుశాపూర్‌లో బుధవారం పండుగ సాయన్న 135వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముదిరాజ్ సంఘం ప్రధానకార్యదర్శి చిలక గణేష్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లకు రాజ్యాధికారం దక్కాలంటే సాయన్నను ఆదర్శంగా తీసుకొని పోరాటం చేయాలన్నారు.

నేడే తొలి పంచాయతీ

(ఐదో పేజీ తరువాయి)

పరిశీలించారు. యాలాల మండలంలో 256 పోలింగ్ బూత్‌లకు 256 మంది పీఓలను నియమించారు. 300 మంది ఓపీఓలు 18 మంది జోనల్ అధికారులు, తొమ్మిది మంది రూట్ అధికారులను, 42 మంది స్టేజ్ - 2 ఆర్వోలను, 25 మంది రిజర్వు సిబ్బందిని నియమించారు. మండలంలోని 39 గ్రామ పంచాయతీలకు గాను పది పంచాయతీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 29 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. బషీరాబాద్ మండలంలో 39 గ్రామ పంచాయతీలకు ఐదు పంచాయతీలు ఏకగ్రీవం కాగా 34 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగబోతున్నాయి. 39 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.


కొడంగల్‌లో ఎన్నికల సామగ్రితో వెళ్తున్న సిబ్బంది

కొడంగల్ పరిధిలో..

గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రం ద్వారా కొడంగల్ నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి ఎన్నికల సామగ్రిని తరలించారు. ఎన్నికల విధుల్లో భాగంగా కొడంగల్ మండలంలో తొమ్మిది రూట్‌లుగా 155 వార్డులకు పీవోలు 212 మంది, ఏపీవోలు 260 మంది విధులు నిర్వహించనున్నారు. గురువారం జరిగే పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు ఆయా గ్రామాలకు పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. ఎన్నికల సామగ్రి, పోలింగ్ సిబ్బందిని 19 బస్సుల ద్వారా ఆయా గ్రామాలకు తరలించారు. బొంరాస్‌పేట్‌లో పంచాయతీ ఎన్నికల కోసం సిబ్బంది, సామగ్రిని తరలించే బస్సు ఇరుక్కుపోవడంతో గంట సిబ్బంది ఇబ్బంది పడ్డారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 13 పంచాయతీలతోపాటు పదుల సంఖ్యలో వార్డులు ఏకగ్రీవం కాగా మిగతా గ్రామాల్లో పోలింగ్ జరగనుంది.


యాలాల మండల కేంద్రం నుంచి బ్యాలెట్ బాక్సులతో గ్రామాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

పటిష్ట భద్రత

కొడంగల్ మండలంలోని 24 గ్రామాల్లో జరిగే పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సివిల్ పోలీసులు 101 మంది, డీఎస్పీ ఒకరు, సీఐలు 13 మంది, ఎస్సైలు 11 మంది, ఏఎస్సైలు 10 మంది, హెడ్‌కానిస్టేబుల్‌లు 20 మంది, కానిస్టేబుల్‌లు 59 మంది, ఏఆర్ పోలీసులు 20 మంది, పోలీసు ప్రత్యేక బలగాలు 24 మంది, ఫారెస్టు సిబ్బంది ఐదురితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

కిష్టాపూర్ డివిజన్ ఏర్పాటుపై హర్షం


సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కిష్టాపూర్ గ్రామస్తులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మున్సిపాలిటీని జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తూ కిష్టాపూర్‌ను 298 డివిజన్‌గా మార్చడం పట్ల కిష్టాపూర్ గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు రాష్ట్ర బెవరేజేస్ త్రిసభ్యకమిటీ సంభ్యుడు నవీన్ రెడ్డి, మేడ్చల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు టపాసులు కాల్చి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మేడ్చల్‌లో ఓ వార్డుగా ఉన్న కిష్టాపూర్‌ను గుర్తిస్తూ డివిజన్ స్థాయి హోదా కల్పించటం హర్షణీయమన్నారు.

పూడూరు డివిజన్‌గా పేరు మార్చాలి

మేడ్చల్‌లో మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న పూడూరు పేరును వదిలేసి చిన్నవార్డుగా ఉన్న కిష్టాపూర్ పేరిట 298డివిజన్ ఏర్పాటు చేయటం పట్ల పూడూరు గ్రామ ప్రజలు అభ్యంతం వ్యక్తం చేశారు. ఈ మేరకు పూడూరు గ్రామ మాజీ సర్పంచ్ బాబు యాదవ్ ప్రభుత్వానికి అభ్యంతరం తెలుపుతూ వినతి సమర్పించనున్నట్లు తెలిపారు.

అభ్యంతరాలుంటే తెలియజేయాలి: డీసీ

మేడ్చల్ టౌన్: మేడ్చల్ మున్సిపాలిటీని జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తూ ప్రభుత్వం డీలిమిటేషన్ గజిట్ జారీ చేయడం పట్ల అభ్యంతరాలు ఉంటే ఈనెల 17వ తేదీ వరకు తమకు తెలియజేయాలని మేడ్చల్ డీసీ చంద్రప్రకాష్‌రెడ్డి కోరారు. డివిజన్‌లకు సంబంధించిన ప్రభుత్వం జారీ చేసిన గజిట్ నోట్‌ను బుధవారం స్థానిక జీహెచ్‌ఎంసీ డీసీ కార్యాలయం నోటీసు బోర్డులో ఏర్పాటు చేశారు.

గౌతాపూర్‌లో రాజకీయ రచ్చ

- ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకున్న బీఆర్‌ఎస్ నేతలు
- ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఎమ్మెల్యేపై సర్పంచ్ అభ్యర్థి ఫిర్యాదు

తాండూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం గౌతాపూర్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ రచ్చ నెలకొంది. బుధవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గౌతాపూర్ గ్రామానికి తన అనుచరులతో కలిసి రావడం వివాదం నెలకొంది. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తు కాంగ్రెస్ పార్టీ తరుపు అభ్యర్థికి ప్రచారం చేస్తున్నారని బిఆర్‌ఎస్ నేతలు సర్పంచ్ అభ్యర్థి సుజాత రాజప్ప గౌడ్ తన అనుచరులతో వచ్చి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వాహనాన్ని అడ్డుకున్నారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్,పోలీస్ ఝులుం నశించాలనే నినాదం చేస్తు ఆందోళన చేపట్టడంతో కొంత సేపు ఉద్రికత్త పరిస్థితి ఏర్పాడింది. కొద్దిసేపు తర్వాత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సంఘటనపై బిఆర్‌ఎస్ అభ్యర్థి సుజాత రాజప్ప గౌడ్ తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, తాండూరు ఎంపీడీఓ విశ్వప్రసాద్‌లకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించడంతో పాటు సమావేశం ఏర్పాటు చేశారని సర్పంచ్ అభ్యర్థి సుజాత గౌడ్ ఆరోపించారు. కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు పేర్కోన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్పందిస్తూ గౌతాపూర్ గ్రామానికి చెందిన పెద్దలు రాంరెడ్డి ఆరోగ్య పరిస్థితి బాగా లేదని పరామర్శించడానికి వెళ్లానని దీనిపై బిఆర్‌ఎస్ నాయకులు రాదాంతం చేయడం అవివేకమని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఓడిపోతామని బిఆర్‌ఎస్ నేతలు ఆరాచకం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.


తాండూరు మండలం గౌతాపూర్‌లో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

శామీర్‌పేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ అత్యున్నత స్థాయికి ఎదగాలని జీనియస్ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ కల్పనారెడ్డి, కరస్పాండెంట్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని జగ్గంగూడ పరిధిలోని జీనియస్ గ్రామర్ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి అభిజ్ఞ ఈనెల 9వ తేదీన వికారాబాద్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14 ఖోఖో క్రీడాపోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో రాణించి జిల్లా స్థాయిలో రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ కల్పనారెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ అంటోని అడ్విన్, శామీర్‌పేట జోనల్ కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డిలు అభినందిస్తు ఘనంగా సన్మానించారు.

జాతీయస్థాయి క్రీడలకు వెంకట్

జీనియస్ గ్రామర్ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి వెంకట్ జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు బుధవారం శామీర్‌పేట జోనల్ సెక్రటరీ గుర్రం సత్తిరెడ్డి తెలిపారు. ఈనెల 22వ తేదీన ఝార్ఖండ్‌లో నేషనల్ వాలీబాల్ టోర్నమెంట్ క్రీడాపోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో జీనియస్ స్కూల్‌కు చెందిన క్రీడాకారుడు వెంకట్ ఆడనున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా వెంకట్‌ను అభినందించారు.

ఎమ్మెల్యేల స్వగ్రామాల్లో ఎన్నికలిలా..

పరిగి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాల జోరు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పరిగి నియోజకవర్గానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల స్వగ్రామాలపై అందరి దృష్టి ఉంది. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి స్వగ్రామం దోమ మండలం శివారెడ్డిపల్లి కాగా తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి స్వగ్రామం కులకచర్ల మండలంలోని తీర్మాలాపూర్. అయితే ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి స్వగ్రామమైన తీర్మాలాపూర్‌లో సర్పంచ్‌గా వార్ల మాధవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి స్వగ్రామమైన దోమ మండలం శివారెడ్డిపల్లిలో ముగ్గురి మధ్య పోటీ నెలకొంది. శివారెడ్డిపల్లి జనరల్ మహిళకు రిజర్వు అయింది. జి.ప్రభావతి, జి.లక్ష్మమ్మ, ఎం.పద్మమ్మలు పోటీలో ఉండగా వీరిలో ఇద్దరు కాంగ్రెస్, ఒకరు బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేస్తుండటం గమనార్హం.

కులకచర్లలో త్రిముఖ పోటీ

కులకచర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల పంచాయతీలో త్రిముఖ పోటీ నెలకొంది. ఇక్కడ సర్పంచ్ స్థానం బీసీ జనరల్‌కు రిజర్వు కావడంతో పోరు హోరాహోరీగా సాగనుంది. ప్రధాన పార్టీల మద్దతుతో బరిలోకి దిగిన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకం కావడంతో అన్ని అస్త్రాలను ప్రయోగిస్తున్నారు. సర్పంచ్ పదవికి ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలిచారు. జోగు వెంకటయ్యగౌడ్ (కాంగ్రెస్, వారువాల అంజిలయ్య ముదిరాజ్ (బీజేపీ). మాలే కృష్ణయ్యగౌడ్ (బీఆర్‌ఎస్)ల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ముగ్గురు అభ్యర్థులు ఆయా పార్టీల్లో క్రియాశీలకంగా ఉండటంతో పోటీ రసకందాయకంగా మారింది. ఈ నెల 17వ తేదీన మూడో విడతలో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. కులకచర్ల పంచాయతీలో మొత్తం 14వార్డులు ఉండగా 4,422 మంది ఓటర్లు ఉన్నారు. అందులో మహిళలు 2263, పురుషులు 2159 మంది ఉన్నారు. పోటీలో ఉన్న ముగ్గురు అభ్యర్థులు రాజకీయంగా బలంగా ఉండటంతో ఎవరు పాగా వేస్తారోనని పలువురు చర్చించుకుంటున్నారు.

పార్కుస్థలం చుట్టూ కంచె వేసిన హైడ్రా

ఘట్‌కేసర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఘట్‌కేసర్ సెక్టార్‌లో గల బాలాజీ నగర్‌లోని సాయిప్రగతి లేఅవుట్‌లో ఆక్రమణకు గురైన 1.17ఎకరాల విస్తీర్ణంలో గల పార్కు స్థలం చుట్టూ బుధవారం హైడ్రా అధికారులు కంచె నిర్మించి బోర్డు ఏర్పాటు చేశారు. గతనాలుగు రోజుల క్రితం ఘట్‌కేసర్‌లోని చిన్న చెరువు కింద గల సాయిప్రగతి హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లోని 1.17ఎకరాల స్థలంను పార్కు కోసం కేటాయించారు. ఉన్నట్టుండి ప్రైవేట్‌వ్యక్తి తన స్థలంలో ఉందని కొంతభాగాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేపట్టాడు. స్థానికులు జీహెచ్‌ఎంసీ సెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా స్పందించిన అధికారులు ఇటీవల ప్రహరీని కూల్చివేశారు. తాజాగా హైడ్రా అధికారులు రంగంలోకి దిగి పార్కు స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేసి బోర్డు ఏర్పాటు చేశారు.



ఆక్రమణకు గురైన పార్కు స్థలం చుట్టూ కంచె నిర్మించి హైడ్రా ఏర్పాటు చేసిన బోర్డు

అనురాగ్, ఎన్ఆర్ఎస్‌సీల మధ్య ఒప్పందం

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పోచారం, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీతో ఎన్ఆర్ఎస్‌సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ మేరకు అనురాగ్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ అర్చన మంత్రి, ఎన్ఆర్ఎస్‌సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్‌లు ఒప్పందాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రకాష్ చౌహాన్ మాట్లాడుతూ బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ, రిసెర్చ్ చేసిన అనురాగ్ విద్యార్థులు ఎన్ఆర్ఎస్‌సీలో ప్రాజెక్టులు పూర్తి చేసుకోవచ్చాన్నారు. అలాగే ఇండస్ట్రియల్ టూర్‌లకు వెళ్లి పరిశోధనలు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఎస్‌సీ డిప్యూటీ డైరెక్టర్ అపర్ణ, గ్రూప్ హెడ్ శశిధర్‌రెడ్డి, అనురాగ్ యూనివర్సిటీ సీఈవో నీలిమా, డైరెక్టర్ సిద్దార్థ ఘోష్, అసోసియేట్ డైరెక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందిచడం అభినందనీయం

శామీర్‌పేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట పోలీసులు ప్రజలకు ఉత్తమ సేవలందిస్తూ దేశ, రాష్ట్ర స్థాయిల్లో గుర్తింపు పొంది ఆదర్శంగా నిలవడం అభినందనీయమని రైతు సమాఖ్య ఉమ్మడి మండలాల మాజీ అధ్యక్షుడు, రైతు సంఘం మండల నాయకుడు బుద్ధి అంజనేయులు తెలిపారు. బుధవారం వారిని సన్మానించారు.

ఏకగ్రీవ సర్పంచులకు సన్మానం


పరిగిలో ఏకగ్రీవమైన సర్పంచులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


లింగన్‌పల్లి సర్పంచ్, వార్డు సభ్యులతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పరిగి నియోజకవర్గంలోని పంచాయితీ ఎన్నికల్లో 20 మంది కాంగ్రెస్ మద్దతుదారులు ఏకగ్రీవం కాగా బుధవారం పరిగిలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పంచాయితీ ఎన్నికల్లో వందశాతం కాంగ్రెస్ అభ్యర్థులే గెలుస్తారని తెలిపారు. ఏకగ్రీవమైన పంచాయతీలన్నీ కాంగ్రెస్ వారేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దాంతి పార్థసారథి, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, నాయకులు తావుర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

దోమ: మండలంలోని లింగన్‌పల్లి సర్పంచ్ గోపాల్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులు ఏకగ్రీవమయ్యారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని బుధవారం వారిని శాలువాలతో సన్మానించారు. దోమ మండలంలో ఐదుగురు కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవం కావడం సంతోషదాయకమన్నారు. మండలంలోని మిగతా గ్రామాల్లో ఈనెల 17వ తేదీన జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

స్పీకర్‌ను కలిసిన ఏకగ్రీవ సర్పంచ్

నవాబుపేట: మండలంలోని మైతాప్‌ఖాన్ గూడలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ దుర్గ ప్రసాద్, ఉప సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు లింగంపల్లి రంగారెడ్డి, మాజీ సర్పంచ్ అనితారంగారెడ్డితో కలిసి బుధవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం ఎన్నికల కోడ్ అనంతరం చర్చిద్దామని తెలిపారు. అన్ని విధాలుగా గ్రామం అభివృద్ధి కోసం కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, బీర్బల్, నాయకులు డాక్టర్ రాజు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


నవాబుపేట: స్పీకర్‌ను కలిసిన ఏకగ్రీవ సర్పంచ్ దుర్గ ప్రసాద్, ఉప సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి